# గల్లీకొక శంకర్‌దాదా..

**-ఫేక్ డాక్టర్లు ..నకిలీ మందులు**
**-బస్తీలు, కాలనీల్లో యథేచ్ఛగా వైద్యం**
**-రోగం ఏదైనా అందరికీ యాంటీబయోటిక్స్ అందజేత**
**-మెడికల్ కౌన్సిల్, డ్రగ్ కంట్రోల్ దాడుల్లో వెలుగులోకి**



**హైదరాబాద్, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** ఇటీవల తీవ్ర అనారోగ్యంతో నిమ్స్‌లో చేరిన ఓమహిళకు వివిధ పరీక్షలు చేయగా మూత్ర పిండాలు వైఫల్యం చెందినట్లు వైద్యులు గుర్తించారు. వివిధ అనారోగ్య సమస్యల నుంచి ఎప్పటికప్పుడు ఉపశమనం పొందడానికి దీర్ఘకాలికంగా నొప్పి నివారణ మందులు వాడుతున్నట్లు తేలింది. స్థానికంగా ఉన్న వైద్యుడు అందించే ఈ వైద్యం... ఆమె కిడ్నీకు చేటు తెచ్చిందని తెలుస్తుంది. ఆమె మాత్రమే కాదు.. నిమ్స్‌కు మూత్రపిండాల వైఫల్యంతో వస్తున్న వారిలో 10నుంచి 15 శాతం కేసులు ఈ తరహావే ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. నిపుణులైన వైద్యుల సూచనలు లేకుండా నొప్పి నివారణ, యాంటాసిడ్ మందులు వాడటం చాలా ప్రమాదకరమని సూచిస్తున్నారు. అరకొర జ్ఞానంతో సేవలు అందించే ఆర్ఎంపీలు, నకిలీ వైద్యుల ప్రభావం ఇప్పుడు నగరంపై కూడా పడుతోంది. తాజాగా సంఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. కొందరు ఎంబీబీఎస్ డిగ్రీలే కాదు..స్పెషలైజన్స్ డిగ్రీలు పెట్టుకొని దర్జాగా వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా నగరంలోని చిన్న చిన్న బస్తీలు, గల్లీలు, కాలనీలే అడ్డాలుగా క్లినిక్‌లు తెరిచి ఇలాంటి వారు వైద్య సేవలు అందిస్తున్నారు.తొలుత చిన్న చిన్న సమస్యలకు ప్రాథమిక వైద్యం అందించి రోగుల్లో నమ్మకం కల్పిస్తున్నారు. పది రకాల మందుల గురించి తెలుసుకొని లక్షణాలు బట్టి అవే రోగులకు అందిస్తుంటారు. యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ లాంటి మందులతో తాత్కాలికంగా ఉపశమనం దొరుకుతుండటంతో చాలామంది వీటినే ఆశ్రయిస్తున్నారు. అంతేకాక ఇక్కడ తక్కువ ఫీజు కూడా ఇందుకు ఒక కారణం .రెండు రోజుల క్రితమే మేడ్చల్ మేడిపల్లిలో రూప్ సింగ్ అనే నకిలీ డాక్టర్ తప్పుడు ఇంజెక్షన్లతో పి.ఎల్లో (56) మరణానికి కారణమై రిమాండ్‌కు గురయ్యాడు. అలాగే ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరప్పగడ్డలో అర్హత లేని నకిలీ డాక్టర్ బానోతు శ్రీనును ఏసీబీ ఉప్పల్ జోన్ టీమ్ అరెస్టు చేసింది. అంజలి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, మెడికల్ షాప్‌ను రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతూ డాక్టర్ సర్టిఫికెట్లు లేకుండా చికిత్సలు అందిస్తున్నాడని తేలింది. సదరు నకిలీడాక్టర్‌పై కేసు నమోదు చేయగా.. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది.

**బోర్డులో ఒకరిపేరు ... లోపల మరొకరు**

నిబంధనల ప్రకారం ఆసుపత్రి పెట్టాలంటే కనీసం ఎంబీబీఎస్ ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఎంబీబీఎస్ ధ్రువపత్రంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు దరఖాస్తు చేస్తే అన్నీ పరిశీలించిన తర్వాత మాత్రమే ఆసుపత్రికి అనుమతి ఇస్తుంది. అక్రమార్కులు నకిలీ ఎంబీబీఎస్ ధ్రువపత్రం సంపాదించి అధికారులను ఏమార్చి అనుమతి పొందుతున్నారు. మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి బోర్డు ఏర్పాటు చేసి ప్రముఖ వైద్యుల పేర్లు బోర్డు మీద రాయిస్తున్నారు. లోపలికి వెళ్తే ఆ వైద్యులు కన్పించడం లేదు. స్థానిక ప్రైవేటు ప్రాక్టీషనర్స్ దర్శనం ఇస్తున్నారు. అయితే తమ పరిధిలోని ఆసుపత్రులను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంది. వైద్యానికి సంబంధించిన అంశాలే కాకుండా, ఫీజులు ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ ఓ కంట కనిపెట్టాలి. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్లే ఆస్పత్రులను తరచూ తనిఖీలు చేయలేకపోతున్నామని కొన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

**రుజువైతే ఏడేళ్లు శిక్ష..**

చాలామంది విదేశీ యూనివర్సిటీల్లో వైద్య విద్య పూర్తి చేసినట్లు పట్టాలు చూపుతున్నారు. ఆరా తీస్తుంటే అవన్నీ నకిలీ యూనివర్సిటీలే. కొందరైతే దొంగ డిగ్రీలు పుట్టిస్తున్నారు. నకిలీ డిగ్రీ అని తేలితే పోలీసులు 420 సెక్షన్ ప్రకారం కేసులు పెడుతున్నారు. దీనివల్ల ఏడేళ్ల శిక్ష పడే అవకాశం ఉంది. ఇక చికిత్స చేసి ఎవరి చావుకైనా కారణమైతే 302, 304(ఎ) సెక్షన్ల కింద కేసు పెడుతున్నారు. రుజువైతే ఏడేళ్లు అంతకంటే ఎక్కువ శిక్ష పడుతుంది.

**యథేచ్ఛగా నకిలీ మందుల దందా..**

నగరంలో నకిలీ, నాసిరకం ఔషధాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఉత్తుత్తి మందులను అమ్ముతూ కేటుగాళ్లు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. రాష్ట్రంలో ఔషధ నియంత్రణ అధికారులు చేస్తున్న దాడుల్లో నకిలీ మందుల ముఠాలు భారీగా బయటపడుతున్నాయి. మార్కెట్‌లో పేరున్న కంపెనీల బ్రాండ్లతో నకిలీ ఔషధాలను తయారు చేస్తున్నారు. ఇటువంటి ఔషధాల్లో అసలు మందే ఉండటం లేదు. అలాగే కొన్నిసార్లు అసలు మందుకు బదులు వేరే ఔషధాన్ని నింపుతున్నారు. కొద్ది రోజుల కిందట ఔషధ నియంత్రణ అధికారుల దాడుల్లో ఒకంపెనీకి చెందిన అమోక్సిలిన్ బదులు పారాసిటమాల్ ఉంచి విక్రయిస్తున్నట్లు బయటపడింది. అలాగే ఔషధాల తయారీలో వినియోగించే రసాయనాలను సమపాళ్లలో కలపడం లేదు. ఇటువంటి ఔషధాలతో ఆరోగ్యం మరింత దెబ్బతింటోంది. రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అధికారులు ఇటీవల పెద్ద ఎత్తున దాడులు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో నాణ్యత లేనివి, నకిలీ మందులు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఘజియాబాద్, ఖాసీపూర్, ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు నకిలీ ఔషధాలు వస్తున్నాయి. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటిదాకా రూ.కోట్ల విలువైన నకిలీ ఔషధాలను డీసీఏ అధికారులు పట్టుకున్నారు.



# హైదరాబాద్ వార్త

## జూపార్కులో ఆహ్లాదకరమైన వాతావరణంలో పక్షుల వాక్







జూ పార్కులోని పలు రకాల పక్షులు

**చార్మినార్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో మంగళవారం ఉదయం జూ పార్కు ఆధ్వర్యంలో పక్షుల వాక్ కార్యక్రమం జరిగింది. మంగళవారం ఉదయం ఆరు గంటలు నుంచి తొమ్మిదిన్నర గంటలు వరకు వాక్ కొనసాగింది. హైదరాబాద్ బర్డింగ్ పాల్స్‌కు చెందిన దాదాపు యాభై మంది జూ పార్కులో జరిగిన పక్షుల వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. జూపార్కులో ఆహ్లాదకరమైన వాతావరణంలో రామ చిలుకలు, కింగ్ ఫిషర్, పలు రకాల పక్షులు, అడవి కోళ్లు, బాతులు, కొంగలు, గుడ్లగూబలు, గబ్బిలాలతో పాటు దాదాపు డబ్బై పక్షులు వాక్‌లో పాల్గొన్న వారికి కనిపించాయి. వివిధ రకాల పక్షులను తిలికించిన వాక్ పాల్గొన్న వారు ఎంతో అనుభూతికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్‌తో పాటు పలువురు పాలొగన్నారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు నేలమట్టం

**- ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు పెడతాం : తహసీల్దార్**



కోకాపేట్‌లో ప్రభుత్వ భూమిలో వెలిసి అక్రమ నిర్మాణంను కూల్చివేసిన గండిపేట రెవెన్యూ అధికారుల దృశ్యం.

**నార్సింగి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** గండిపేట మండలం కోకాపేట్ గ్రామంలోని సర్వే నెంబర్ 147.లో వెలిసి అక్రమ నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చి వేశారు. ఈ సర్వే నెంబర్‌లోని మొత్తం స్థలంలో అధికారులు ఇళ్లపట్టాలు, రాజీవ్ గృహకల్ప ఇళ్ల నిర్మాణంకు కేటాయించగా 1000.గజాల స్థలం మిగిలిపోయింది. దీనిపై కొందరు స్థానిక రాజకీయ నాయకుల కన్ను పడింది. ఎలాగైనా కోట్ల రూపాయల విలువ చేసే ఈ స్థలంను కబ్జా చేయాలని ఏకంగా కలెక్టర్ సంతకంనే ఫోర్జరీ చేసి, 58.జీవో కింద పట్టాలు వచ్చాయని పేర్కొంటూ 80.గజాల చొప్పున నాలుగు పట్టాల స్థలం 320.గజాలను కబ్జా చేసి ఏకంగా భారీ నిర్మాణంను ప్రారంభించారు. ఈ విషయంను తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తన సిబ్బందిని పంపించి, వారి వద్ద ఉన్న పట్టాలు తెప్పించి పరిశీలించారు. అనుమానం వచ్చి జిల్లా కలెక్టర్ కార్యాలయంకు పంపించి విచారణ చేయించగా కలెక్టర్ సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తేలింది. వెంటనే నార్సింగి పోలీసులకు సదరు కబ్జాదారులపై కేసులు పెట్టాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి నెల రోజుల క్రితమే ఫిర్యాదు చేశారు. పోలీసులు 4.వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఈ నిర్మాణంను తహసీల్దార్ ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు దగ్గరుండి జేసీబీతో కూల్చి వేశారు.

**తహసీల్దార్ వివరణ :**

ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గండిపేట మండలంలో ఉన్న ప్రభుత్వ స్థలాల రక్షణకు స్థానిక ప్రజలను కూడా భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ భూములు ప్రజల భావి అవసరాల కోసం వినియోగించుకోవాలని, ఇలా ఎవరు పడితే వారు కబ్జాలు చేస్తే క్రిమినల్ కేసులు పెడ్తామని హెచ్చరించారు. కబ్జాదారులు ఎంతటి వారపై వెనుకాడే ప్రసక్తే లేదని, చట్టం ముందు అందరూ సమానమే అని, కబ్జాదారులకు కఠినమైన శిక్షలు పడేలా చూస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి మరిన్ని సౌకర్యాలు : ఎమ్మెల్యే తలసాని



అధికారులతో మాట్లాడుతున్న తలసాని

**సంజీవరెడ్డి నగర్, జనవరి 3, ప్రభాతవార్త:** బల్కంపేటలోని ప్రసిద్ధ ఎల్లమ్మ ఆలయానికి నిత్యం లక్షలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో, వారి సంఖ్యకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వెనుక భాగంలో రూ.4.21 కోట్ల వ్యయంతో జీ ప్లస్ త్రీ విధానంలో నిర్మిస్తున్న కిచెన్, డైనింగ్ హాల్ భవన పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భవన నిర్మాణ పనుల వివరాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వాహనాల పార్కింగ్, మొదటి అంతస్తులో కిచెన్, రెండో, మూడో అంతస్తుల్లో డైనింగ్ హాల్స్ ఏర్పాటు చేసేలా డిజైన్ చేసినట్లు తెలిపారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మవారి కళ్యాణానికి 7 నుంచి 8 లక్షల మంది వరకు భక్తులు హాజరవుతున్నారని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి వల్ల ఆలయ ఆదాయం కూడా పెరిగిందని గుర్తు చేశారు. గతంలో ప్రత్యేక రోజులలో 30 వేల మంది భక్తులు వస్తే, ప్రస్తుతం రోజుకు లక్ష మందికి పైగా భక్తులు దర్శనం చేసుకుంటున్నారని తెలిపారు. పూజా సామగ్రి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న వారికి బోనం కాంప్లెక్స్ వద్ద దాతల సహకారంతో షాపులు నిర్మించి ఉచితంగా కేటాయించామని చెప్పారు. నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈఓ శంకర్, హైమావతి, అమీర్‌పేట సర్కిల్ డీసీ సుజాత, డీఈ మహేష్, టూరిజం డిఈ హనుమంత రెడ్డి, ఎలక్ట్రికల్ డిఈ సుధీర్, శానిటేషన్ డిఈ వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, హనుమంతరావు, అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, పీయూష్ గుప్తా, వనం, కుమార్, సీనియర్ సిటిజన్స్ పార్థసారథి, రాజేష్ ముదిరాజ్, కూతురు నరసింహ, కట్ట బలరాం, శ్రీనివాస్ గౌడ్, వేణు గౌడ్, హరి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**



వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్,ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** ఎస్సీ విద్యార్థుల సౌకర్యార్థం హిమాయత్ నగర్ లో వసతిగృహం మార్చడం జరిగిందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. మంగళవారం కలెక్టర్ నూతన వసతి గృహాన్ని సందర్శించి వసతి గృహం, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ అభివృద్ధి శాఖకు సంబంధించిన అమీర్‌పేట కళాశాల వసతి గృహం, కింగ్ కోటి లోని అద్దె గృహంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రత్యేక చొరవ తీసుకొని హిమాయత్ నగర్‌లోని నూతన భవనంలో మార్చడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ నూతన వసతి భవనంలో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని వివరించారు. తదుపరి సిబ్బంది వివరాలు, బాలికల సంఖ్య, వంటగది, డైనింగ్ హాల్, బాలికల గదులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు ఎప్పటికప్పుడు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని, ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, తరచుగా ఏఎన్ఎంలు సందర్శించాలని, మెడికల్ క్యాంపులు చేపట్టాలని, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రాత్రి వేళలో సరిపడా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎఎస్‌డబ్లూవోలు కె .మోహన్, సత్యనారాయణమూర్తి, శ్రీనివాస బాబు ,ఆర్ శాంతి వార్డెన్ స్వప్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

**-రూ.6.73 లక్షల నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం**

**జీడిమెట్ల, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మొబైల్ ఫోన్ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, ఒక మొబైల్ ఫోన్‌తో పాటు రూ.6,73,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం 07-01-2026 తేదీ తెల్లవారుజామున నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఓ పేషెంట్ వద్ద మొబైల్ ఫోన్ దొంగతనం జరిగింది. అనంతరం ఆ మొబైల్‌లో ఉన్న ఫోన్ పే ఖాతా ద్వారా నిందితుడు సుమారు 8 లక్షల నగదును అక్రమంగా ట్రాన్స్‌ఫర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడు ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా సూరారం పోలీస్ స్టేషన్ క్రైం టీం సీసీటీవీ కెమెరాల ఫుటేజ్ పరిశీలన, బ్యాంక్ ఖాతాల లావాదేవీల తనిఖీ చేపట్టి నిందితుడిని గుర్తించారు. మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్, రూ.6, 73,000 నగదును రికవరీ చేసినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుడిని బూరడ ఆది నారాయణ (34) కవిడిపల్లి గ్రామం, మండలం, మెదక్ జిల్లాగా పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో స్వాధీనం చేసుకున్న ఆస్తి మొత్తం విలువ రూ.7,00,000గా అంచనా వేశారు. కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోందని సూరారం పోలీసులు తెలిపారు.

## మల్లాపూర్‌లో నకిలీ డాక్టర్ అరెస్ట్



మల్లాపూర్‌లో పట్టుబడ్డ నకిలీడాక్టర్ కృష్ణ

**తార్నాక, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :** మల్లాపూర్ లో ఓ నకిలీ డాక్టర్ ను అరెస్టు చేసిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మల్లాపూర్ భవానీ నగర్‌లో అక్రమంగా వైద్య సేవలు అందిస్తున్న నకిలీ డాక్టర్‌ను నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. అక్షయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్" పేరుతో క్లినిక్ నిర్వహిస్తూ, సరైన వైద్య అర్హతలు లేకుండా చికిత్స అందిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నాచారం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారంతో డెకాయిట్ ఆపరేషన్ నిర్వహించగా, కానిస్టేబుల్ రాహుల్ ఆదిత్య మఫ్టీలో రోగిగా వెళ్లినప్పుడు నిందితుడు డాక్టర్‌లా నటిస్తూ మందులు సూచించినట్లు తెలిపారు. నిందితుడు సురే వెంకట కృష్ణ (39), భవానీ నగర్, మల్లాపూర్ నివాసిగా గుర్తించారు. గత మూడేళ్లుగా అక్రమంగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు అంగీకరించాడు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## హుస్సేన్‌సాగర్‌లో దూకి యువతి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న

**హైదరాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

హుస్సేన్‌సాగర్‌లో దూకి తోష్నివాల విజయలక్ష్మి (26) అనే యువతి బలవన్మరణానికి పాల్పడింది. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన సదరు యువతి ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు మీడియాకు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా కండ్లకోయకు చెందిన విజయలక్ష్మి కూకట్‌పల్లిలోని మైత్రీనగర్‌లో అద్దెకు ఉంటోంది. తండ్రి తన చిన్నతనంలోనే చనిపోగా.. తల్లితో కలిసి ఉంటుంది. ఓవైపు ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, మరోవైపు తల్లికి సేవలు చేస్తూ జీవనం కొనసాగుతోంది. విజయలక్ష్మి రెండు రోజుల క్రితం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, మంగళవారం హుస్సేన్‌సాగర్‌లో ఆమె మృతదేహం లభ్యమైంది. పెళ్లి కావడం లేదనే బాధతో ఆమె ఆత్మహత్య చేసుకుందనే ప్రచారం జరుగుతోందని..ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమని పోలీసులు స్పష్టం చేశారు. విజయలక్ష్మి గత కొంతకాలంగా తీవ్రమైన డిప్రెషన్‌తో బాధపడుతోందని వెల్లడించారు. డిప్రెషన్ నుంచి బయటపడడానికి ఆమె క్రమం తప్పకుండా మందులు వాడుతోందని తెలిపారు. మానసిక వేతనను భరించలేకనే యువతి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కూకట్‌పల్లి పోలీసులు అనుమానిస్తున్నారు. యువతి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## కేబుల్ బ్రిడ్జిపై బైక్ దగ్ధం



**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన మాదాపూర్‌లోని కేబుల్ బ్రిడ్జిపె చోటు చేసుకుంది. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం..రోడ్ నెంబర్ 45 వైపు నుంచి ఐకియా వైపు తన ద్విచక్ర వా హనం(పల్సర్)పై వెళ్తున్న కొమనంతల జతిన్ కేబుల్ బ్రిడ్జి పైకి రాగానే ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. గమనించిన జతిన్ బైక్‌ను పక్కన ఆపడంతో ప్ర మాదం తప్పింది. కాగా మంటల్లో బైక్ పూర్తిగా దగ్ధమైంది. అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు.

## వ్యాధుల నియంత్రణలో ఎంఎస్‌యూ సిబ్బంది కీలకం : కమిషనర్ ఆర్.వి. కర్ణన్



శిక్షణకు హాజరైన ఎంఎస్‌యు సిబ్బందితో కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** నగరంలో వ్యాధుల నివారణ, నియంత్రణలో ఎంఎస్‌యూ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. నగర ప్రాంతాల్లో ప్రజారోగ్య భద్రతను మరింత పటిష్టం చేయడానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎంఎస్‌యూ) సిబ్బందికి మూడు రోజుల సంయుక్త ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని డా. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రారంభమైంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, థానే నగరాలకు చెందిన ఎంఎస్‌యూ సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. దీనికి ముఖ్యఅతిధిగా హాజరైన కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ నీటి ద్వారా వ్యాపించే ఆక్యుట్ డయేరియా, కలరా, వైరల్ హెపటైటిస్ వంటి వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధుల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ఫుడ్ పాయిజనింగ్, జూనోటిక్ వ్యాధుల నియంత్రణలో వన్ హెల్త్‌విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. మురికివాడలు, అధిక జనసాంద్రత ప్రాంతాలు, వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లో వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, అక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎంఏబీహెచ్ఐఎం) కింద ఏర్పాటు చేసిన ఎంఎస్‌యూ హైదరాబాద్ నగర వ్యాధుల పర్యవేక్షణకు కేంద్రంగా పనిచేస్తోందని తెలిపారు. 17 పోస్టులకు గాను ఇప్పటికే 14 మందిని నియమించగా, మిగిలిన ఖాళీలను త్వరలో భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో ప్రయోగశాల సేవలు అందుబాటులో ఉన్నాయని, బయోసేఫ్టీ లెవల్2 పరికరాల కొనుగోలు ద్వారా మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వ్యాధుల పర్యవేక్షణ, స్పందన చర్యలు వేగవంతం అవుతాయని వివరించారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్‌లు హేమంత కేశవ్ పాటిల్, రఘు ప్రసాద్, జోనల్‌కమిషనర్ ప్రియాంక అల, జాయింట్ డైరెక్టర్ డా. శుభాంగి కుల్సంగే, డా. ప్రదీప్ అవాటే (ఎంఎస్‌యూ), రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ (హెల్త్) డా.పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ వకీల్ పాల్గొన్నారు.

## హైడ్రా 'ఫైర్ సేఫ్టీ పాఠాలు'

**-నగరమంతటా అవగాహనా కార్యక్రమాలు -కొన్ని చోట్ల ఫైర్ మాక్ డ్రిల్స్**



అవగాహన కల్పిస్తున్న హైడ్రా సిబ్బంది

**హైదరబాద్, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త:** నగరంలో అగ్ని ప్రమాదాల నివారణకు హైడ్రా అవగాహన కార్యక్రమాలను ప్రారంభించింది. నాంపల్లిలోని ఫర్నీచర్ షోరూంలో జరిగిన అగ్ని ప్రమాదంతో పాటు.. నగరంలో జరిగిన పలు ఘటనల నేపథ్యంలో నగర ప్రజలను అప్రమత్తం చేయడానికి చర్యలు తీసుకుంది. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించినట్టు ఇటీవల జరిగిన తనిఖీల్లో వెల్లడైన తర్వాత.. పెద్దయెత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరాన్ని హైడ్రా గుర్తించింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు తూచా తప్పకుండా పాటించేందుకు నెల రోజులు గడువు ఇస్తూనే.. అవగాహన కార్యక్రమాలను కూడా హైడ్రా చేపట్టింది. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఒక వేళ అగ్ని ప్రమాదం జరిగితే ఎలా మంటలను అదుపులోకి తీసుకురావాలి. ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించే విధానాలను ఈ సందర్భంగా హైడ్రా వివరించింది. ఫైర్ ఎక్స్టింగ్విషర్లు వినియోగించడం, మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే వాటర్ స్ప్రింక్లర్ల పనితీరు, స్మోక్ డిటెక్టర్లపై అవగాహన కల్పించారు. పంజాగుట్ట, నార్సింగి, మెట్టుగూడ, కార్వాన్, షాపూర్‌నగర్, ఏ ఎస్ రావు నగర్, చందానగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ఉప్పల్, బేగంపేట, చాంద్రాయణగుట్ట, సంతోష్ నగర్, జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 45, లకడికాపూల్, మాధాపూర్, సనత్‌నగర్, రేతిబౌలి క్రాస్ రోడ్స్, నాగార్జున సర్కిల్, గచ్చిబౌలి మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్, అల్వాల్, బడంగ్‌పేట్, అల్కాపురి క్రాస్‌రోడ్స్, అత్తాపూర్, బంజారాహిల్స్, క్లాక్ టవర్ సర్కిల్, ఈసీఐఎల్, కొంపల్లి, నాంపల్లి, శంషాబాద్, పెద్దఅంబర్‌పేట, బాచుపల్లి, తూముకుంట తదితర ప్రాంతాల్లో ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్మికులు, వ్యాపారులు ఎలా భద్రంగా ఎలా బయట పడాలో సూచించారు. షాపులలో ఫైర్ ఎగ్జిట్ మార్గాలను గుర్తించడం.. మంటలంటుకుంటే అగ్ని మాపక శాఖకు చెందిన 101తో పాటు.. హైడ్రా కంట్రోల్ రూమ్ 1070తో పాటు 9000113667 కు ఫోను చేయాలని తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**తుర్కయంజాల్ ఫిబ్రవరి3,ప్రభాతవార్త**
ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూరు డివిజన్ మునగనూరు జే ఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో జాఫర్‌గూడ నిమి జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ అధ్యక్షుడు మహిత్రి నర్సింగ్ సహకారంతో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సేవలు ఫీవర్, బిపి, షుగర్, డయాబెటిస్, బ్లడ్ టెస్ట్ లు, మలేరియా, టైఫాయిడ్, యురిన్ టెస్ట్ లు చేసి, కాలనీ నివాసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రజలందరూ చెడు వాసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యమంతమైన జీవితాన్ని గడపాలని వారు అన్నారు. ఇటువంటి ఆరోగ్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిమి జనరల్ హాస్పిటల్ వైద్యులు ప్రవర్ధన్, అరుణ్ కుమార్, నితిన్, ఎం డి. షాహిద్, దేవీ ప్రియ, వెంకట్ సిద్ధార్థ్, అక్షయ, అశ్విత, అఖిల, వసీం, సామేల్, జే ఎన్ ఎన్ యూ ఆర్ ఎం కాలనీ వైస్ ప్రెసిడెంట్ రాములు, జనరల్ సెక్రటరీ రవి తేజ, ట్రెజరర్ అప్పారావు, కనుగుల శ్రీనివాస్, దేవర వెంకట్, జట్టయ్య, వెంకట్ రాములు,బండారి హనుమంత్, పి.రాజు, ల్యాబ్ టెక్నీషియన్ పి నితిన్, మార్కెటింగ్ ఎండి షాహిద్ తదితరులు పాల్గొన్నారు

### ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి : అబ్రార్



అజంపుర డివిజన్ ఫర్హత్ నగర్ లో రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న అబ్రార్ తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**
ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి చేస్తున్నామని అజంపుర డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్ లోని ఫర్హత్ నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం పనులను సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగవంతంగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. డివిజన్ లో ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. డివిజన్ ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు

**- డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ**



దిల్ షుక్ నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ అలీ, అధికారులు శరత్ రెడ్డి, వాసు ప్రసాద్ తదితరులు

**మలక్ పేట, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**
పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు చేపడుతున్నామని మలక్ పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇంకేషాఫ్ పేర్కొన్నారు.దిల్ షుక్ నగర్ బ్రిడ్జి వద్ద సంబంధిత అధికారులతో కలిసి ఆయన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిల్ షుక్ నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మలక్ పేట్ సర్కిల్ పరిధిలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శరత్ రెడ్డి,వాసు ప్రసాద్ పాల్గొన్నారు.

### గౌతమ్‌నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:**
గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధి లక్ష్యమని కార్పొరేటర్ మేకల సీతారామ్ యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీ లో రోడ్ నెంబర్ 8, రోడ్ నెంబర్ 10, రోడ్ నెంబర్ 12 లో 25 లక్షల రూపాయల వ్యయం తో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్ నిర్మాణం పనులను ఆమె మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ ప్రజలకు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా నెరవేస్తున్నానని తెలిపారు అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ పట్నాయక్ బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

### లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు



యాదగిరిగుట్ట ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహాస్వామి ఆలయంలో మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ అధికారులకు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దయతో ఉప్పల్ నియోజకవర్గం ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తమకు న్యాయం చేయాలంటూ సర్వే నెం.110 బాధితుల ఆందోళన

**- పిల్ల పాపలతో రోడ్డుపైనే భోజనం..నిద్ర**



ప్ల కార్డులు పట్టుకుని ఆందోళన చేస్తున్న బాధితులు



బాధితులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయానికి అనుబంధంగా ఉన్న బాన్సురివాల కృష్ణ మందిరానికి చెందిన స్థలంలోని ఇళ్లను దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడంతో 11 ఇళ్లలోని వారంతా కుటుంబసభ్యులతో కలసి రోడ్డుపైనే ఉంటున్నారు. 1992 లో సుధాకర్ అనే వ్యక్తి లే అవుట్ చేసి అమ్మితే చట్టబద్ధంగా డబ్బులు చెల్లించి ప్లాట్లు కొనుగోలు చేయడం జరిగిందని, అయితే ఇప్పుడు దేవాదాయశాఖ అధికారులు తమ స్థలమంటూ బలవంతంగా తమను రోడ్డుపై పడేయడం ఎంతవరకు సబబంటూ బాధితులు బోరున విలపిస్తున్నారు. పైసా పైసా దాచుకుని అన్ని అనుమతులతో ఇళ్లు కట్టుకుంటే ఇప్పుడు తమను రోడ్డున పడేస్తే, మాకు దిక్కెవరని వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

**రాత్రంతా రోడ్డుపైనే..**
ఇళ్లకు అధికారులు సీల్ వేయడంతో రాత్రంతా బాధిత కుటుంబ సభ్యులు తమ పిల్లలతో పాటు రోడ్డుపైనే పడుకున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో, తమ సమస్యను పరిష్కరించే వారెవరో అర్థంగాక, తాము చేయని తప్పుకు ఇదేం శిక్ష అంటూ..బాధితులంతా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. విధిలేని పరిస్థితిలో రోడ్డుపైనే తినడం, నిద్రించడం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని అధికారుల తీరుపై నిరసన తెలుపుతూ ఆందోళన చేశారు.

**బాధితులకు అండగా ఉంటాం..**
బాలాజీ నగర్ వాసులు కబ్జాలకు పాల్పడలేదని, చట్టబద్ధంగా ప్లాట్లను కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకుని 35 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నారని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. పేదలపై ప్రతాపం చూపించడం అధికారులకు తగదన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని అన్నారు.

## సమస్యలను త్వరతగతిన పరిష్కరిస్తాం : బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న మహేశ్వర్ రెడ్డి

**హుడాకాంప్లెక్స్,ఫిబ్రవరి 03, ప్రభాతవార్త :**
కాలనీలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల సమన్వయంలో త్వరతగతిన పరిష్కరిస్తామని గడ్డి అన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.శుభోదయం గడ్డి అన్నారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం డివిజన్ పరిధిలోని సరస్వతినగర్ కాలనీలోని పలు ప్రాంతాలలో అయన పర్యటించారు.ఇంటింటికి వెళ్ళి కాలనీవాసుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్యం, తాగునీటి తదితర సమస్యలను వారు కార్పొరేటర్ దృష్టికి తీసుకొని వెళ్ళారు. స్పందించిన అయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాము ఎల్లపుడూ అందుబాటులో ఉంటామన్నారు.అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సరస్వతికాలనీ అధ్యక్షుడు రాజేందర్, జీఎచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంధి యాకయ్య, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాశ్, రత్నం, వంశీ యాదవ్, సిద్దు, వినయ్, గిరీష్ పాల్గొన్నారు.

## అరుదైన శస్త్రచికిత్స చేసినా కమల హాస్పిటల్ వైద్యులు

**-మహిళా గర్భాశయం నుంచి 3.7 కేజీల కంతి తొలగింపు**



ఫిర్జాదిగూడ కమల హాస్పిటల్‌లో 3.7 కేజీల కంతిని తొలగించిన వైద్యులు

**మేడిపల్లి, ఫిబ్రవరి3 ప్రభాతవార్త ;** జిహెచ్ఎంసి బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడలో కమల హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ రాము దాములూరి, డాక్టర్ బి.ఎస్. రావు, డాక్టర్ అశోక్ కుమార్, తదితరులు "ఓపెన్ లేపరేటమి" అనే అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. 43 సంవత్సరాల మహిళ సుమారు ఒకటిన్నర సంవత్సరాల నుండి విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతు కమల హాస్పిటల్ సంప్రదించగా మహిళ గర్భసంచిలో నుండి సుమారు 3.7 కేజీల కంతిని సుమారు 3 గంటల 45 నిమిషాలపాటు శస్త్ర చికిత్స చేసి విజయవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా ప్రముఖ జనరల్ కేర్ క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ కె అశోక్ కుమార్ మాట్లాడుతూ... మహిళలలో గర్భాశయంలో అండాల నుండి ఇలాంటి కంతులు అరుదుగా ఉద్భవిస్తాయని, వీటి వల్ల ఆ మహిళలు తీవ్రమైన నీరసం, విపరీతమైన నొప్పితో బాధపడతారని, ఇలాంటి శస్త్ర చికిత్సలు చేయడం కమల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇది 6వ సారి అని, గతంలో కూడా 5.5 కేజీలు,4 కేజీల కంతులను విజయవంతంగా తొలగించామని సదరు మహిళ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉందని అన్నారు. మహిళలు తమ ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, శరీరంలో ఎలాంటి మార్పులు కనిపించిన తక్షణమే వైద్యులను సంప్రదించాలని, పౌష్టికాహారాన్ని తీసుకుంటూ, తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉండొచ్చని ఆయన సూచించారు. ఈ అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన కమల హాస్పిటల్ వైద్య బృందానికి ఇతర సిబ్బందికి డాక్టర్ అశోక్ కుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ప్రశాంతిహిల్స్ ఫేజ్-4 కాలనీ ఇంటి పన్నులు తగ్గించాలి

**-డిసికి కాలనీ సంక్షేమ సంఘం వినతి**



బడంగ్‌పేట్ సర్కిల్ డిసి సరస్వతికి వినతి పత్రం ఇస్తున్న ప్రశాంతిహిల్స్ ఫేజ్-4 కాలనీ అధ్యక్షుడు డి.కృష్ణ యాదవ్ తదితరులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనమైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్ ఫేజ్-4 కాలనీలో మిగతా ప్రాంతాల కంటే అధికంగా గతంలో విధించబడ్డ ఇంటి పన్నులను తగ్గించాలని కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.కృష్ణయాదవ్ బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన అసోసియేషన్‌కు చెందిన పలువురితో డిసి సరస్వతిని కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ ప్రజలకు ఆర్థికంగా భారమైన అధిక మొత్తాల ఇంటి పన్నుల సమస్యను డిసికి వివరించారు. ప్రశాంతిహిల్స్ ఫేజ్-4 కాలనీ చుట్టు పక్కల కాలనీల్లో విధించిన ఇంటి పన్నులు తక్కువగా ఉన్నాయనీ అయితే తమ కాలనీలో మాత్రం ఏ ప్రాతిపదికను అధిక మొత్తంలో పన్నులు విధించారో ప్రజలకు అయోమయంగా మారిందని ఆయన అన్నారు. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, మంచి నీటి సరఫరా తదితర కనీస సదుపాయాలు తమ కాలనీలో పూర్తి స్థాయిలో లేకున్నా ఇంటి పన్నులు మాత్రం అధికంగా విధించడం పట్ల స్థానిక కాలనీ వాసులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని ఆయన డిసి దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో పన్నులపై పునః పరిశీలన జరిపి తగ్గించాలని ఆయన కాలనీవాసుల తరపున సరస్వతిని కోరారు. అధిక పన్నులను తగ్గించి కాలనీలో నివసిస్తున్న సాధారణ, మధ్య తరగతి ప్రజలకు న్యాయం చేయాలని కృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణ్, మధుసూదన్, చందర్‌రావు, నాగేశ్వర్‌రావు, కమలాకర్‌రావు, జయరాములు, దత్తాత్రి, రమేష్ పాల్గొన్నారు.

## బాలాపూర్ ఉప్పలమ్మ ఆలయ భూమిని రక్షించాలని కోరుతూ బోనాలు



సామూహిక బోనాలతో ఉప్పలమ్మ ఆలయానికి తరలివెళ్తున్న బాలాపూర్ మహిళలు: చిత్రంలో వంగేటి లక్ష్మి, తూళ్ళ సునీతగౌడ్ తదితరులు ఉన్నారు.

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చే బాలాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 10లోనున్న ఉప్పలమ్మ దేవాలయ భూమి రక్షణ కోసం మంగళవారం గ్రామస్తులు బోనాలు నిర్వహించారు. స్థానిక శివాజీ చౌక్ నుండి గణేష్ చౌక్ వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డు పక్కనే సాయి హోమ్స్ కాలనీ ముఖద్వారంకు ఉన్న సదరు భూమిలో పురాతమైన ఉప్పలమ్మ అమ్మవారికి గ్రామంలోని అన్ని వర్గాల మహిళలు సామూహిక బోనాలు సమర్పించారు. ఇటీవల ధర్మ రక్షణ సభ జరిగిన ప్రాంతంలోనున్న ఈ భూమిలో ఉన్న ఉప్పలమ్మ అమ్మవారి ఆలయానికి మంగళవారం మధ్యాహ్నం స్థానిక గ్రామ మహిళలు బాలాపూర్ నడిబొడ్డున ఉన్న బొడ్రాయి వద్ద నుండి ఊరేగింపుగా బోనాలతో వచ్చారు. అనంతరం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారితో పాటు గ్రామ ప్రముఖులు, రాజకీయాలకతీతంగా పలువురు గ్రామస్తులు ఉప్పలమ్మ ఆలయ భూమి రక్షణ కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ గ్రామానికి చెందిన బడంగ్‌పేట్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత, మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, డిసిసిబి మాజీ ఛైర్మన్, బండ్లగూడ ఖల్సా సొసైటీ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ కొలను తిరుపతిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, ఎర్ర మహేశ్వరి జైహింద్, బిఆర్ఎస్‌కు సంబంధించిన సీనియర్ నేత వంగేటి లక్ష్మారెడ్డి, వంగేటి లక్ష్మి, కళ్లెం ఎల్లారెడ్డి, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, చిగిరింత శ్రీరాంరెడ్డి (పెద్ద నర్సింహారెడ్డి), బిజెపికి చెందిన కొలను భాగ్యలక్ష్మి శంకర్‌రెడ్డి, కొంతం సంపత్‌రెడ్డి తదితరులతో పాటు బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత బొర్ర రవి మాదిగ, పెద్ద సంఖ్యలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## జితేందర్ రెడ్డి పాలన నుంచే మదర్ డెయిరీ నష్టాలు ప్రారంభం : మధుసూదన్ రెడ్డి

**హయత్ నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** గత పదేళ్ల కాలంలో జరిగిన అవినీతి, అవకతవకల కారణంగానే మదర్ డెయిరీకి నష్టాలు వచ్చాయని... ప్రస్తుత పాలక వర్గంపై మాజీ చైర్మన్ జితేందర్ రెడ్డి నిందలు వేయడం అర్ధరహితమని మదర్ డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం సొసైటీ అధ్యక్షులతో కలిసి పాలకవర్గన్ని రద్దు చేయడానికి సర్వసభ్య సమావేశం ఏర్పాటుకు నోటీసు జారిచేసిన విషయం తెలిసిందే. దీనిపైన మగళవారం మదర్ డెయిరీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఛైర్మన్ మాట్లాడుతూ... తప్పుడు అడిట్ రిపోర్టులతో బ్యాంకులను మోసం చేసింది కాక తమపై నిందలు మోపడం ఏమిటన్నారు. తాను భాద్యతలు చేపట్టిన నాటి నుండి రైతులు, ఉద్యోగుల సంక్షేమం కోసం పాటు పడుతున్నానని తెలిపారు. సంస్థ ఆర్ధిక ఇబ్బందుల నేపథ్యంలో రైతులకు బిల్లుల బకాయిలు చెల్లించలేని మాట వస్తవమేని దీన్ని అవకాశంగా తీసుకుని ప్రభుత్వం నుండి 35 కోట్లు తీసుకు వస్తానని రైతులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. తమ పాలకవర్గం అవినీతికి పాల్పడినట్లు చేసిన ఆరోపణలు నిరూపించే వరకు సర్వసభ్య సమావేశం పెట్టమన్నారు. గత పాలకవర్గాల అవినీతిపై విచారణకు కమిటీ వేయనున్నట్లు ఛైర్మన్ తెలిపారు. అనంతరం వేతనాల కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగాలతో చర్చించారు. రేపటి నుండి విడతల వారిగా అందరికి వేతనాలను వేస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగులు ఆందోళనని విరమించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గొల్లేపల్లి రాంరెడ్డి, రచ్చ లక్ష్మీ నర్సింహా రెడ్డి, కస్తూరి పాండు, మండలి జంగయ్య, అగ్రాల నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు

### గోహత్య నిషేధ చట్టాలను కఠినంగా అమలు చేయాలి

**- గో రక్ష విభాగం కన్వీనర్ దినేష్ చంద్ర ఉపాధ్యాయ**



భూలక్ష్మి దేవాలయంలో విహెచ్‌పి, గో రక్ష విభాగం ప్రతినిధులు

**సైదాబాద్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గోహత్య నిషేధ చట్టాలను కఠినంగా అమలు చేయాలని విహెచ్‌పి కేంద్రీయ కార్యదర్శి, గో రక్ష విభాగం కన్వీనర్ దినేష్ చంద్ర ఉపాధ్యాయ అన్నారు. ఆదర్శ గోశాల సందర్శనలో భాగంగా మంగళవారం సైదాబాద్‌లోని భూలక్ష్మి గోశాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న గో సంతతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రంలో అక్రమంగా గోవులను తరలిస్తున్నారని, యధేశ్చగా గో హత్యలు జరుగుతున్నాయని అన్నారు. గో హత్య నిషేధ చట్టాలను రాష్ట్రంలో కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గో ఆధారిత వ్యవసాయం, ఉత్పత్తులను ప్రోత్సహించాలని వక్తలు కోరారు. అంతకు ముందు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్రలో పాల్గొన్న రిధి గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి కేంద్రీయ సహ కార్యదర్శి ఆకారపు కేశవరాజు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత సంఘ చాలక్ సుందర్‌రెడ్డి, గోరక్ష క్షేత్ర ప్రముఖ యాదగిరి రావు, అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి, భూలక్ష్మి గోశాల ప్రధాన కార్యదర్శి అరవింద్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు : పరమేశ్వర్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన కాలనీ నేతలు దృశ్యం.

**ఉప్పల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు చూసి పలువురు పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ డివిజన్ గాంధీ నగర్‌కు చెందిన హనుమంత్ రెడ్డి, జి అబ్రహం, బాలరాజు, నర్సింగరావు, అమరనాదజ్, గాంధీ నగర్ యూత్ అసోసియేషన్ యువకులు శేఖర్, శివకుమార్, సాయి రెడ్డి, మనోజ్, చింతా భరత్, నర్సింహ,మల్లేష్, చిన్న,మహేందర్, దేవేందర్,శివ, కిరణ్, క్రాంతి, మల్లి కళ్యాణ్, భాస్కర్, అంబికా, అశ్విని తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బజారు జగన్నాథ్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, కంది శ్రవణ్ రెడ్డి, విజయ్ కుమార్, రాజన్న, జావిద్,జహంగీర్ పాల్గొన్నారు.

### గ్యాస్ గోదాం తొలగించాలని బిజెపి నేతల ఫిర్యాదు



గ్యాస్ గోదాం తొలగించాలని ఫిర్యాదు చేస్తున్న బిజెపి నేతలు డా.శిల్పారెడ్డి, మార్నెని పణీందర్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన గ్యాస్ గోదాం తొలగించాలని పలువురు బిజెపి నేతలు మంగళవారం అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్, బిజెపి సీనియర్ నేతలు శామీర్‌పేట ధర్మారెడ్డి, తీగ విఠల్‌రావు, రమేష్, నర్సిరెడ్డి తదితరులు అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ భగాయత్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన గ్యాస్ గోదాం తొలగించాలని సూచించారు. నివాస ప్రాంతంలో గ్యాస్ గోదాం ఏర్పాటు చేయడం తగదని తెలిపారు. అధికారుల నుంచి ఎన్ఒసి లేకుండానే పనులు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

### ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** ఉప్పల్ 11 కెవి వెంకటేశ్వర టెంపుల్ ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ నిఖిల్ తెలిపారు. ఉప్పల్ వెంకటేశ్వరకాలనీ, పద్మావతి కాలనీ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు, అదే విధంగా 11 కెవి చిలుకానగర్ ఫీడర్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ, శ్రీనివాస హైట్స్, అపూర్వ హైట్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

### సిసి రోడ్డు పనులు ప్రారంభం



**మల్కాజిగిరి ఫిబ్రవరి 3, ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్ నగర్ లో 33 లక్షలతో సిసి రోడ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, భాస్కర్, సింగ్,సురేష్, సోమేశ్వర రావు, శైలజ, రాహత్, కిరణ్, కృష్ణ,ఓంరాజ్, చంద్రకళ, శర్మ, వెంకటరమణ,కృష్ణ,భాను శంకర్, రహమత్ ఖాన్ పాల్గొన్నారు.

## నాసా స్పేస్ డిజైన్ ప్రాజెక్ట్‌ల పోటీల్లో సత్తా చాటిన నారాయణ విద్యార్థులు




నాసా పోటీల విజేతలను అభినందించిన నారాయణ ఎజిఎం రవీంద్రబాబు తదితరులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:** నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన లైవ్ ఇన్ ఎ హెల్తీ స్పేస్ డిజైన్ ప్రాజెక్ట్ పోటీల్లో జల్‌పల్లి బ్రాంచికి చెందిన నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు సాధించారు. ఇటీవల నాసా ప్రపంచవ్యాప్తంగా 2025-2026కు సంబంధించిన పోటీలను నిర్వహిస్తూ ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇండియాతో పాటు పాకిస్థాన్, మలేషియా, యుఎఇ తదితర దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో జల్‌పల్లి నారాయణ బ్రాంచ్ విద్యార్థులు సత్తా చాటారు. అయితే మిషనల్ టైటన్ ప్రాజెక్ట్‌ను రూపొందించిన గౌరవ్, సంగీత, దినేష్, సుధాంశులు ప్రథమ శ్రేణికి ఎంపికయ్యారు. అదే విధంగా మూన్ స్పేస్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ తయారు చేసిన సిద్ధేశ్వరి తృతీయ శ్రేణికి ఎంపికైంది. ఈ నేపథ్యంలో జల్‌పల్లిలోని నారాయణ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ విపి జోన్ ఎజిఎం రవీంద్రబాబు నాసా పోటీల విజేత విద్యార్థులకు పుష్పగుచ్ఛాలనిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక నాసా నిర్వహించిన పోటీల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటి ప్రథమ, తృతీయ శ్రేణిలో నిలవడం నారాయణ విద్యా సంస్థలకే గర్వకారణమని అన్నారు. నాసా పోటీల విజేతలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ప్రిన్సిపాల్ రవికుమార్, ఆకాడమిక్ డీన్ హరిబాబు, ఆర్అండ్‌డి హెడ్ శివరంజని, కో-ఆర్డినేటర్ సుజన్ రాథోడ్, ఎఇ రవిబాబు, నాసా నారాయణ ఇంఛార్జి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణనగర్‌లో కొత్త విద్యుత్ స్థంభాల ఏర్పాటు : అరుణ్



రామంతాపూర్‌లో బస్తీబాటలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ తదితరులు

**రామంతాపూర్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** రామంతాపూర్ బాలకృష్ణనగర్ కాలనీలో కొత్త విద్యుత్ స్థంభాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకున్నామని ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 20 రోజుల క్రితం ఈ ప్రాంతంలో పర్యటించి పలు సమస్యలు గుర్తించామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో వెంటనే 15 కొత్త విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ నేతలు ఆకారపు అరుణ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు జిల్లు, సతీష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు వేణుగోపాల్ చారి, నాగమల్లయ్య, కాసింగౌడ్, నాగరాజు, బ్రహ్మయ్య, శంకర్, రామచంద్ర, నరసింహ రాము, శ్రీనివాస్, బాలాజీ, ప్రణయ్,పవన్, విష్ణు, భరత్, చరణ్ మహిళ నేతలు స్రవంతి, నాగలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

### ఘనంగా వాగ్దేవి సంస్కృత భారతి 25వ వార్షికోత్సవం



**నేరేడ్ మేట్, ఫిబ్రవరి 3,ప్రభాతవార్త :**
నేరేడ్మెట్ దీన్‌దయాల్‌నగర్ లోని శ్రీ విజయ వినాయక దేవాలయంలో శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక-ధార్మిక సంస్థ 25వ వార్షికోత్సవాన్ని మూడు రోజుల పాటు కనుల పండుగగా వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ మహా సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథశర్మ-సంధ్య దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి.వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ముందుగా పల్లకిసేవ, కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, గోపూజ నిర్వహించారు. అనంతరం నవగ్రహ, యోగిని, క్షేత్రపాలక, సర్వతోభద్ర మండప ఆరాధనలతో పాటు గణపతి, నవగ్రహ, రుద్ర, సరస్వతి, లక్ష్మి, చండీ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.అలాగే శ్రీ మహా సరస్వతి అమ్మవారికి 108 లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం, వివిధ ఫలరసాలతో అభిషేకాలు, పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించి భక్తులను ఆధ్యాత్మిక పరవశానికి గురిచేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు పొందిన ఆర్.కే.ఎస్. కళానిలయం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాట్యాచార్య శ్రీమతి సుందరి రవిచంద్ర శిష్యబృందం నిర్వహించిన నృత్య కళార్చన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.మూడు రోజుల పాటు శారీరక సేవలు అందించిన నరసింహ సేవ సమితి సభ్యులు చిరంజీవి, సంధ్య, ఝాన్సీ తదితరులను వాగ్దేవి సంస్కృత భారతి సభ్యులు ఘనంగా అభినందించారు.

## మీనాక్షీ నటరాజన్‌ను కలిసిన చార్మినార్ కాంగ్రెస్ నాయకులు



రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్‌ను కలిసిన చార్మినార్ కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం గుప్త,ప్రేమలత అగర్వాల్,లలిత అగర్వాల్

**మైలార్‌దేవ్‌పల్లి,ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్‌ను మంగళవారం చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ది హైదరాబాద్ హోల్ సేల్ ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం గుప్త,సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు,ఎస్‌సిపిసిఆర్ సభ్యురాలు ప్రేమలత అగర్వాల్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు లలితా అగర్వాల్,జయసింహాతో పాటు పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు.కాంగ్రెస్ పార్టీని బ లోపేతం చేయటాని కి అందరూ కలిసి కట్టుగా కృషి చే యాలని కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్ కోరారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం గుప్త తెలిపారు.